# అలివేణి - కౌసల్యా - శర్మ

అలివేణి రాజమండ్రి నుంచి మదరాసుకు ప్రయాణం చేస్తున్నది. దూరపు ప్రయాణం. బట్టల బ్యాగ్‌తో పాటు మూడుగిన్నెల టిఫిన్ కారియర్‌లో మూడు రకాల భోజన పదార్థాలు నింపుకుని, మంచినీళ్ల సీసాతోకూడా బుట్టలో సర్ది తువాలు కప్పింది. రెండు వారపత్రికలతో తన రిజర్వుడు సీటులో కూర్చుంది.

పత్రికచేతబట్టగానే శీల మనసులో మెదిలి కళ్ళముందర నిలబడినట్లని పించింది.

శీల ఆరునెలల పిల్లగా ఉన్నప్పుడు తల్లి దగ్గర మదరాసులో వదిలి పెట్టింది. ఆరునెలలకోసారి వెళ్ళి చూసివస్తూ ఉంటుంది. ఈ మధ్య ఉద్యోగ రీత్యా వత్తిడులవల్ల కొంచెమాలస్యమయింది. ఆమె చేసేది ఒక ప్రైవేటు స్కూల్లో ప్రధానోపాధ్యాయిని ఉద్యోగం.

ఉద్యోగంలో ప్రమోషన్‌లు వచ్చినకొద్దీ బాధ్యతలు కూడా ఎక్కువవు తున్నాయి. సెలవులు తక్కువ వున్నాయి. ఒకవక్క బాధ్యతలూ-ఒకపక్క కడుపు తీపి. ఆమె రెండిటితో సమన్వయం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తూ ఉంటుంది.

శీలకు ఎనిమిదేళ్లు నిండవస్తున్నాయి. అమ్మా నాన్న దూరంగా ఉన్నారని తెలుసు. అమ్మమ్మ గారాబం చేసినా విద్యాబుద్ధుల దగ్గర ఏమాత్రం దయ చూపించదు. క్రమబద్ధమైన అలవాట్లను చేసింది కాని ఆమె ఎంతచేసినా— ఎప్పుడో వచ్చి, వారం రోజులుండి, బొమ్మలూ, బొమ్మల పుస్తకాలూ శీలకోరిన బట్టలూ, కొనిచ్చి, కథలూ కబుర్లూ చెబుతూ, ముద్దులు పెట్టుకుంటూ రాత్రిళ్లు తనదగ్గర పడుకోబెట్టుకునే కన్నతల్లిమీదికే ఆమె ప్రాణాలు లాగుతూ ఉంటాయి.

అటువంటి ఛాయలు ఏమాత్రం కనబడినా, అమ్మమ్మ శీల మనసును మరొక వైపుకు తిప్పే ప్రయత్నం చేస్తూ ఉంటుంది.

ఇటు కన్నతల్లి మనసు కూడా ఆగేదికాదు.

అలివేణి మనసు గుబగుబలాడుతున్నా కొంతసేపు పత్రిక మీద తన దృష్టిని నిలిపింది. వారపత్రికలో ఎడిటోరియల్-''మన దేశంలో సమస్యలు పుట్టలు పుట్టలుగా ఉన్నాయి. ఎంత ప్రతిభావంతుడైన ప్రధాని వచ్చినా ఆ సమస్యలను సర్దిపెట్టటమేగాని ఒకసమస్యనైనా మళ్ళీ తలఎత్తకుండా పరిష్కారం చేసిన వాళ్ళు కనబడరు. ఎదురుగా చెత్తఉంటే ఇటు పక్కకూ అటుపక్కకూ నెట్టినట్టు చేస్తారు. ఒకవేళ ఎవరయినా పరిష్కరించటానికి ప్రయత్నించినా ప్రజానీకం అడుగడుగునా అడ్డం వస్తుంది. ఇంతలోకి ప్రధాని పదవీ విరమణ కాలం సమీపిస్తుంది. అది కాకపోయినా ప్రజలు ఆయనను ఎప్పుడు పదచ్యుతుణ్ణి చేయాలా అని ఎత్తులు వేస్తూనే ఉంటారు. ధర్నాలూ, స్ట్రైకులూ, బందులూ, అల్లర్లూ, చంపుకోవటాలూ దేశంలో ఏదో ఒకమూల ముమ్మరంగా సాగుతూనే ఉంటాయి. రాజకీయాలు మనకెందుకులే అనుకుంటే పౌర బాధ్యత లేనట్లనిపిస్తుంది. మాతృ భూమిపట్ల గల అభిమానాన్ని ఉద్రేకంలోకి మార్చి ప్రవర్తిస్తే జరిగేపని అది.'' అబ్బ ! పత్రికను అక్కడ పడేసింది.

ఒక స్టేషనులో రైలు ఆగగానే తలుపు దగ్గరకు వెళ్ళి నిలబడ్డది అలివేణి. అది ఏ స్టేషనో చూసి తిరిగి తన సీటు దగ్గరకి వస్తుండగా ఒక యువతి కూర్చోటానికి చోటులేక నిలబడి ఉంది సూట్ కేసుతో.

పరస్పరము పలకరించుకున్న తరువాత అలివేణి "నా సీటు పక్క సీటు ఖాళీగా ఉంది. రండి అక్కడ కూర్చుందురుగాని. మనం కబుర్లు చెప్పుకుంటూ ప్రయాణం చెయ్యవచ్చు. నేను ఒంటరిగా ప్రయాణం చేస్తున్నాను" అన్నది.

కౌసల్య సరేనని తలఊపి ఆమె ననుసరించింది. "అర్జంటుగా ప్రయాణం చేయవలసి వచ్చింది. రిజర్వు చేసుకోవటానికి కూడా సమయం లేదు. మా అమ్మకు ఒంట్లో బాగాలేదని మధ్యాహ్నమే టెలిఫోను వచ్చింది. అందుకని విశాఖపట్నం నుంచి వస్తున్నాను'' అన్నది.

ఇద్దరూ చాలా సేపు తమ ఉద్యోగాలను గురించి వాటి కష్టనష్టాలను గురించి చెప్పుకున్నారు. అసలు పేరు అన్నపూర్ణగాని అత్తవారింట్లో కౌసల్య అని పెట్టారుట. అంతా కేశీ అని పిలుస్తారట. కాలేజీలో పనిచేస్తున్నదట. ఇద్దరు మగపిల్లలు-పదీ, ఎనిమిదేళ్ళవాళ్ళు. ఇంట్లో అన్ని పనులూ చేయటానికి ఒక నౌకరుందిట. భర్త టూరింగ్ ఆఫీసరట.

''ఏమిటీ ? మీకు నాకంటె ఎక్కువ జీతమా ? అదెట్లా ?" అంది కేశీ.

''నాది ఎమ్మేడ్ గ్రేడు. అది కాక హెడ్ మిస్ట్రెస్‌ని కదా ? అన్నీ కలుపుకుంటే ఎక్కువే మరి. మీరు కాలేజీలో లెక్చరర్ కదా. మీకు ముందు ముందు బాగా ఎక్కువవుతుంది. నేనిక్కడే ఉంటాను. పేస్కేలును బట్టి పెరుగుతూ ఉంటుంది జీతం. అంతేగా ?'' అంది అలివేణి.

ఆ తరువాత ఇద్దరి సంభాషణ భర్తలిమీదికి మళ్ళింది.

"మావారికి ఊళ్ళు తిరిగే ఉద్యోగం. అందుకే మా అమ్మాయిని అమ్మ దగ్గర ఉంచాను. మా అమ్మకు నేనొక్కదాన్నే. ఆమె ఒంటరిగా ఉంటోంది. వాళ్ళను చూడటానికే బయలుదేరాను'' అన్నది అలివేణి.

"నాకు పిల్లలను చూసే నౌకరుంది అదీకాక మా వాళ్ళింట్లో తోడుగా ఐదారుగురు పిల్లలున్నారు. నాకు ఇల్లు కనిపెట్టుకుని ఉండటానికి దూరపుచుట్టం కూడా ఇంట్లోనే ఉంటుంది. మావారు నెలకు ఇరవైరోజులు కేంపు అంటూ వెళ్తారు. ఒకోసారి నెలంతారారు'' అంది కౌసల్య.

ఎన్నో విషయాలమీద కబుర్లుదొర్లాయి. మాటల సందర్భంలో కౌసల్య అన్నది-'' ఆయన ఊళ్ళో ఉన్న పదిరోజులూ ఉన్నారు కదా అన్న సంతోషం మిగలనియ్యరు. ఏమిటో చికాకు మనిషి, క్రమబద్ధంలేని అలవాట్లు. ఒకరోజు ఎనిమిది గంటలకు కాఫీ-ఒకరోజు ఆరుగంటలకే కాఫీకాఫీ అన్న కేకలూ, ఒక రోజు పగలు రెండు గంటలకు రాత్రి పదకొండు గంటలకూ భోజనం. ఏదీ సరిగా లేదని అరుపులూ చిటపటలూ ఇదీ మా దినచర్య. అందుకని ఆయన టూర్‌కి వెళ్తేనే బాగుండుననిపిస్తుంది నాకు'' అన్నది.

"మావారు నెలకు ఏవరేజి పదిరోజులుంటారేమో !''

''ఉన్నప్పుడైనా తిన్నగా ఉంటారా పోనీ !" అడిగింది కౌసల్య.

''నేను స్కూల్లో ఉన్నంతసేపూ ఆయన ఆఫీసులో ఉంటారు కదా. ఆయన కంటె నేనే ముందర ఇంటికి వస్తాను. ఆయన కాఫి తప్ప ఇంకొకటి తీసుకోరు. నేను ఆయనకు కావలసినవి వేళకు అందేటట్టు చూస్తాను. పదిగంటలకు ముందరే నేను స్కూలుకు వెళ్ళాలి కనుక వేడివేడిగా తింటే బాగుండే వంటకాలు చేసి-ముఖ్యంగా ఆయనకు నచ్చినవి 'భోజనంచేద్దాంరండి' అనగానే వస్తారు. కబుర్లు చెప్పుకుంటూ తింటాం. ఇంట్లో కొంచెం ఆలస్యమయితే మా అసిస్టెంటుకు ఫోను చేస్తాను''

"అయితే కాఫీ ఎప్పుడూ ?"

"కాఫీయా ? నేను ఐదింటికే లేస్తాను. నేనొక్కదాన్ని తాగలేను. మీరు కూడా రండి' అనగానే ముఖం కడుక్కుని వస్తారు. వేడివేడి కాఫీ సర్' అనగానే దిగ్గున లేచి వస్తారు. ఇద్దరం జామ చెట్టుకింద ఉన్న సిమెంటు బెంచీమీద కూర్చుని బిస్కెట్లు తింటూ కాఫీ, తాగుతాము. కాసేపు కబుర్లయిన తరువాత పేపరు చేతికిస్తాను. ఆయన చదువుకుని స్నానం చెయ్యగానే నేను వంటపని పూర్తిచేసుకుని, ఇంకా-ఇంకా టైముంటే ఇంటి పనులు కొన్ని చక్క పెట్టుకుంటాను. "హాట్ హాట్ ములక్కాడ సాంబారు ఉర్లగడ్డ కూర. రండి-రండి" అనగానే వస్తారు. ఇద్దరం కలిసి భోజనం చేస్తాము"

"మావారు అట్లాఉంటే ఇంకా నాకు కావసిందేముంది ? రోజుకొక గండంగా గడుస్తోంది. చికాకు పడని క్షణం లేదు. ఏమిటో ? చిన్నప్పుడు అదుపూ ఆజ్ఞాలేకుండా పెరిగినట్లున్నాడు.'' అన్నది కౌసల్య ముఖం కందగడ్డలా చేసుకుని.

"ఆయనకు కోపం వచ్చి అరిస్తే మీకేమనిపిస్తుంది ?" పైకివచ్చే నవ్వుకు అదిమి పెట్టింది అలివేణి.

"నాకా ? అరి కాలి మంటనెత్తి నెక్కుతుంది ! ఈ రోజుల్లో తనతో సమానంగా చదువుకుని, తనతో సమానంగా సంపాదించుకునే స్త్రీ మీద పురుషుడికెందుకండీ అంత అహంకారం ? ఆయన అరిస్తే నేనూ అరుస్తాను. మీరేచెప్పండి. కష్టపడి నేను వంటచేస్తే తినటానికేమిటట ? అసలు తనకు ఇష్టా ఇష్టాలేమిటి ? "అది పనికిరాదు' 'ఇది పనికి రాదు'. అది డోకు ఇదిడోకు అనే ఈ మనిషితో

ఎట్లా కాపరం చెయ్యటం ? నేనెందులో తక్కువ అని అట్లామాట్లాడతాడు ? ఏమన్నా నేను పడాలా ? నేనూ మనిషినేగా ! నాలుగు మాటలూ అనేసి భోజనం చెయ్యకుండా కాలేజికి వెళ్ళిపోతాను. వండి అక్కడ పెట్టానుగా. నేను వెళ్ళిపోయాక తింటాడో ఏంచేసుకుంటాడో ?''

"ఇదొక్కటేనా లోపం ? ఇంకా ఏమయినా ఉన్నాయా ?"

"ఇది చాలదూ నా ప్రాణం తియ్యటానికి ?''

''అంటే డబ్బుదగ్గరగాని అన్నింట్లో మిమ్మల్ని అదుపుచెయ్యటంగాని తిట్టటం కొట్టటంగాని అటువంటివన్నమాట''.

"అబ్బే అవేం లేవు. తన జీతం తెచ్చి నాచేతికే ఇస్తాడు. నేనెక్కడికయినా వెళ్ళిరావటంతో ఆలస్యం చేస్తే ఇంట్లో వంట మొదలుపెడతాడు. డబ్బు ఎందుకింత ఖర్చుచేశావని అడగడు. పనిమనిషి రావటం ఆలస్యమైతే సహాయం చేయటానికి వస్తాడు. పిల్లల చదువుసంగతి తనే చూసుకుంటాడు".

"అయితే ప్లస్‌పాయింట్స్ ఎక్కువ కనబడుతున్నాయి''.

''ఆఁ. ప్లస్‌పాయింట్సు తొంభైతొమ్మిదింటిని ఒక మైనస్ కొట్టి పారేస్తున్నది. నా జీవితాన్ని అలా ఆశాభంగాలతో, కఠోరశాసనాలతో నిర్జీవంగా ఈడ్చుకొస్తున్నాను. నాబాధ ఏమిటంటే నాకు సంతోషాన్నిచ్చే పని ఒక్కటైనా చేయడే ? సంతోషంగా సెలవుల్లోనయినా గడుపుదామంటే వీలుకాకుండా చేస్తాడే ?" కనుబొమలు ముడిచింది కేశి.

"ఆయన కిష్టమైన పని మీరు ఒకటైనా చేస్తారా ?''

"ఎందుకు చెయ్యాలి ?" అంది రుస రుస లాడుతూ.

''ఇంతకుముందు మీరన్నారు కదా-'' ఒకోరోజు ఇద్దరం ఘర్షణపడితే భోజనంలేకుండా కాలేజికి వెళ్ళిపోతాన''ని. అలా భోజనం లేకుండా అక్కడ పాఠలేం చెబుతారండీ పాపం ?''

''ఎవరికి పాపం ?''

"మీ ఇద్దరూ ఉపవాసాలుండి ఉద్యోగాలెట్లా చేస్తున్నారా అని జాలిగా ఉంది

నాకు. కాలేజిలో పిల్లలకు పాఠాలు పోవటంలేదూ? నీరసంగా ఉంటే క్లాసులో నిలబడి పాఠాలు చెప్పటం కష్టంకదా?"

"ఏమీలేదు. నేను కాలేజి క్యాంటిన్‌లో తింటాను. ఆయన చేసిన వంట ఉంటే తింటారు. లేకపోతే చేసుకుంటారు. అదీకాకపోతే హోటళ్ళు లేవా? ఇంక కాలేజి స్టూడెంట్సంటారా? వాళ్లు పాఠం చెప్పినా వినిపించుకోరు. ఇంక మీజాలి ఎవరిమీద?''

ఇద్దరూ కబుర్లు చాలించి టిఫిన్‌వేళకు టిఫిన్, భోజనంవేళకు భోజనం అలివేణి టిఫిన్ కారియర్‌లోది సర్దుకుని తిన్నారు. కొంచెంసేపు వీక్లీలు తిరగ వేశారు. కళ్ళు మూతలుపడ్డాయి ఇద్దరికీ.

ఒకగంట తరువాత ఇద్దరూ లేచారు. పరుగెత్తే రైలూ, వెనక్కుపోయే ప్రకృతి దృశ్యాలూ, రైలుపొగ, కళ్లలో దుమ్ముపడేటట్టుగా గాలి- కళ్లు నలుపుకుంటూ చూస్తున్నారు.

"మీ బుట్టలో ఏదో పుస్తకం ఉన్నట్టుంది. ఇవికూడా మోసుకుపోతున్నారే మీ అమ్మాయిని చూడటానికి వెళ్తూ? తీరిక ఉంటుందా చదవటానికి?'' అంటూ ఎర్రట్ట అట్టఉన్న పుస్తకాన్ని తీసి పేజీలు తిప్పటం మొదలుపెట్టింది కౌసల్య.

కొంతసేపయిన తరువాత "ఇటువంటి పుస్తకాలవల్లనే మగవాళ్లు చెడిపోతున్నారు. మూడోకన్ను తెరుస్తున్నారు. వీళ్ళంతా పెంకి గుఱ్ఱాలనుకోండి. అయినా విదేశాలల్లోకూడా మనవంటి అమాయకపు జీవులు బయలుదేరుతున్నారు. 'స్టడీయువర్‌మాన్ అంటూ ఒక చాప్టర్, సుఖంగా' జీవించటానికి సూత్రాలూ, ప్రేమను నిలుపుకోవటం ఎలా?- ఇవన్నీ ఈవిడ చెప్పాలటండీ మనకు? ఈ పుస్తకాలూ, ఈ రాతలూ మగవాళ్ళకు అలుసునిస్తాయి. ఛీ ఛీ మీరెట్లా చదువుతున్నారండీ ఇవన్నీ?'' అంటూ కిటికీలోనుంచి గిరాటేసింది విసురుగా.

"అయ్యో. ఆ పుస్తకం నాదికూడా కాదు. ఒక ఫ్రెండ్‌నడిగి తెచ్చాను. ఇప్పుడెట్లా! నేను కొనివ్వాలి'' అంటూ గుండెమీద చెయ్యేసుకుంది అలివేణి.

''అది పారేశానని దిగులుపడుతున్నారా? అటువంటివన్నీ చదివి మీటైమ్ వేస్టు చేసుకోకండి. మీ స్నేహితురాలు అంతగా అడిగితే నాకు జాబురాయండి.

నేను కొని పంపుతాను. మా నెల్లూరు వచ్చింది. బై-" అంటూ దిగిపోయింది కౌసల్య దూకుడుగా.

నివ్వెరపోయి చూస్తోంది అలివేణి రైలు కదిలిన తరువాతకూడా. ఆమె తిరిగి తన సీటు దగ్గరికి వస్తుండగా ఒక చిన్న ఫోటో దానివెనక 'ఎం.కె. శర్మ ఇన్సూరెన్సు ఏజంటు' అని రాసి ఉంది. అటు ఇటూ దానిని తిప్పితిప్పి చూసింది. అలివేణి.

'ఈయనకేనేమో ఆమె విడాకులిస్తానని ఫోటో చేతబట్టుకుని ఉద్రేకంతో మాట్లాడింది ? ఆ జోరులో అది కిందపడటం చూసుకోలేదు కాబోలు.'

'పాపం ఇంటికి వెళ్ళి వెతుక్కోదు కద ?'

'ఎందుకు వెతుక్కుంటుంది? విడాకులివ్వాలని మండిపడుతూ చెప్పిందిగా!' అనుకుంది మళ్ళీ.

అలివేణి ఆ ఫోటోను మరొక్కసారి చూసింది.

ఆమె మనసు దానిని చూడగానే ఆదోలా ఐపోయింది.

"ఎందుకు మీరు ఇట్లా ద్విపాత్రాభినయం చేస్తున్నారు మహానుభావా! పిల్లలను కూడా మీకిచ్చేసి విడాకులిస్తాననేవరకూ ఆమెదగ్గర- నీవు నాలో జీవం పోశావు. నన్ను ఒకమనిషిని చేశావు. ప్రేమంటే ఏమిటో నేర్పావు అంటూ ఇక్కడ- ఎలా అభినయించగలుగుతున్నారు ?'

ఏది సత్యం ? ఏదసత్యం ?

మీది ద్వంద్వ ప్రకృతా ?

స్టడీ యువర్ మాన్ అని ఆమెరాసినందుకే అంతకోపం వచ్చి పుస్తకం బైటపారేసిందే కౌసల్య! ఒకరిని గురించి ఒకరు బాగా తెలుసుకోకపోతే కలిసి జీవించటమెట్లా ? ఒకరికొకరు మన్నించుకుంటూ జీవించకపోతే క్షణక్షణమూ చిటపటలేగా ! ఆ చిటపటలు లేకుండా జీవించటానికి చిట్కాలు చెప్పినందుకు రచయిత్రికి చివాట్లూ-నాకు ఫైన్ వేసిందా ?

అయితే నేను వెనకటి శతాబ్దపు మనిషినా ?

ఆమె ఆధునిక యువతా ?

ఏది నిజం ? ఏది నిజం ?

ఏది అవసరం ? ఏదికాదు?

ఏది ప్రాచీనం ? ఏది ఆధునికం?

ఎవరు తేల్చిచెప్పాలి ?

ఈ ఆలోచనలతో మదరాసు మహానగరంలో రైలు ఆగగానే తడుముకుంటూ తన సామాను పట్టుకుని దిగింది అలివేణి.